# తరువాత ఏమయింది, కథ?

"మొన్న ఈ మధ్య ఏమయిందో ఎరుగుదువా?.... తెనాలిలో ఓ ఇరవై ఏళ్ళమ్మాయిట; వాళ్ళ నాన్నగారితో కలిసి బస్‌స్టాండు కొచ్చింది. ఏవో అవసరమైన కాగితాలు మరచిపోయానని అమ్మాయి నక్కడ ఉండమని ఆయన ఇంటికెళ్ళాడు. కొంతసేపటికి ఓ ముప్ఫయ్యేళ్ళ వ్యక్తి వచ్చి; 'మీ నాన్నగారు కాగితాలు పుచ్చుకుని చౌక్ దగ్గిరున్నారు. గుంటూరెడుతున్నార్టగా; చిన్న కార్లో ప్రయాణం; రండి' అని ఆమెని విజయవాడ తీసుకుపోయాడు. ఒక యింట్లో ఆమెని నిర్బంధించి 'నిన్ను ప్రేమిస్తున్నాను; నన్ను పెళ్ళాడు' అనటం సాగించాడు. నాలుగురోజులు మొరాయించి, చివరికి రిజిష్ట్రార్ ఆఫీసులో దరఖాస్తు చెయ్యడానికి వొప్పుకుందామె. జరిగిన కథంతా చిన్న స్లిప్పుమీద రాసి రిజిష్ట్రార్‌గారికి చాటుగా అందించింది. దాంతో ఆయన ఆ అమ్మాయిని రక్షించాడు"— అన్నాడు సుబ్బారావు.

"కొయ్" అన్నాను.

"ఏం కాదు, ఆ అమ్మాయి పేరు స్వర్ణలత. వాళ్ళ నాన్నగారి పేరు వీరభద్రరావు. వాళ్ళిల్లు మారీస్‌పేటలో—"

"ఇదంతా నీకెలా తెలుసు?"

ఇదే కాదు. పరీక్ష ఫెయిలై ఇంట్లో వాళ్ళ చివాట్లు భరించలేక వెళ్ళిపోయిన విద్యార్థి తిరిగి పదిరోజుల్లో ఇంటికి చేరిన వైనం; కోటప్పకొండ తిర్నాళ్ళలో తప్పిపోయిన అరవైఏళ్ళ వృద్ధురాలు, దొంగలముఠా చేతుల్లో పడీ కూడా తననీ బంగారాన్నీ రక్షించుకున్న వివరం, సినిమాకని వేల్పూరు నుంచి తణుకు వెళ్ళిన ఇద్దరు యువతుల్ని ఎవరో దుండగులు, ఏలూరులో వ్యభిచార గృహానికి అమ్మి వేయగా పోలీసులు రెయిడింగ్ చేసి వాళ్ళ దగ్గిర పొందవలసినది (సమాచారం, అదీ) పొంది తిరిగి వాళ్ళను వేల్పులుగా (వేల్పూరు పౌరులుగా) చెయ్యడం యిలాంటివి మిక్కిలి వివరంగా పేర్లతో (ఒక్కొక్కపుడు ఇంటి పేర్లతో డోర్ నెంబర్లతో సహా) చెప్పడం సుబ్బారావు హాబీ. ఎలా చెబుతాడో, అస లెలా తెలుసుకుంటాడో అని మిత్రబృందం ఆశ్చర్యపడతాం.

అయితే, ఆ మధ్య ఒక ఆదివారం నన్ను సుబ్బారావు వాళ్ళింటికి రమ్మంటే వెళ్ళగా, ఆ సమయానికి అతనింటి దగ్గర లేకపోడం వల్ల; వాళ్ళావిడ "ఇప్పుడే వస్తానని వెళ్ళారండి; కూర్చోండి" అంటే; ఆవిడ కాఫీతెచ్చి ఇచ్చేలోగా ఏదో పుస్తకం తిరగేద్దామని లేచిన నాకు ఒక బైండు పుస్తకం కనబడింది. అది న్యూస్ పేపర్‌లో సగం సైజు కుంది. అట్టమీద "తరువాయి కథ తెరపై చూడుము" అని అందంగా రాసి వుంది.

తెరిచి చూద్దును!

బాబూ, నువ్వు వెళ్ళిన దగ్గర్నుంచి మీ అమ్మ వచ్చి మంచినీళ్లు ముట్టలేదు. నిన్ను ఎవరూ ఏమీ అనరు. వెంటనే తిరిగి రావలయును. ఇట్లు నీ తండ్రి.... ఫోటో, అడ్రస్, వగైరా—

కనబడుటలేదు. ఈ ఫోటోలో అమ్మాయి- వయసు ఎనిమిది- కడసారిగా కనిపించినప్పుడు నీలంగౌను తొడిగింది. పువ్వులు స్వీట్లు ఇష్టం. నంగిరిగా మాట్లాడుతుంది. ఆచూకీ తెలిపిన వారికి....

పోయినది. మొన్న (22-11-79) అన్నవరం నుంచి శ్రీకూర్మం బస్సులో ప్రయాణం చేసినప్పుడు నాయొక్క సమస్తమైన సర్టిఫికేట్లతో నా జిప్‌బ్యాగ్ పోయినది.... తగిన బహుమతి ఇవ్వగలవాడను—

ఇలాంటి నూస్ పేపర్ కటింగ్స్ అన్నీ ఒకటొకటిగా (మహా అయితే పేజీకి రెండుకి మించకుండా) ఆ పుస్తకం యెడంవేపు పేజీల్లో అంటించాడు. కుడివైపు పేజీల్లో "ఆ తరవాత ఏమయిందంటే—" అని హెటిల్ పెట్టి; ఆ వ్యక్తులు పుస్తకాలు, వస్తువులు స్వస్థానానికి ఎలా చేరుకున్నది (ఎందువల్ల చేరనిది) ఆ వైనమంతా స్వంత దస్తూరీలో రాశాడు సుబ్బారావు.

1978 అని ఓ సంపుటం ఉంది. అది తెరవబోతూ వుంటే సుబ్బారావు భార్య కాఫీ తెచ్చియిస్తూ "చూశారా? ఇదండీ ఈన చేసే వుద్యోగం. ఇలా న్యూస్‌పేపర్ చూసి అలా టూర్ బయల్దేరతారండి. ఇలా అయితే ఈ ఆస్తి యింకెన్నాళ్లు" అని కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

అయినా సరే, తరువాతి కథ ఏమయిందో తెలుసుకోడంలో

సుబ్బారావు పడే నిజమైన తపనను మెచ్చుకోకుండా ఉండలేకపోయాను. న్యూస్ పేపరు చూస్తూ ఈ రకమైన ప్రకటనల్ని వార్తల్ని న్యూస్‌గా కాక న్యూసెన్స్‌గా తీసుకునే నా స్వభావానికి నొచ్చుకున్నాను.

అయితే రెండే రెండు సందర్భాల్లో సుబ్బారావు ప్రవర్తన అంతు పట్టలేదు. వాళ్ళ బావమరది (మన్ మోహనకృష్ణ అనే రచయిత) తన సూట్ కేస్ పోగొట్టుకున్నప్పుడు; సాక్షాత్తు సుబ్బారావు రెండో కొడుకు (నాలుగేళ్ళవాడు) గోదావరి పుష్కరాల్లో తప్పిపోయినప్పుడూనూ.

కుర్రాడు తప్పిపోతే పేపర్లో ప్రకటన వెయ్యలేదు. సరికదా; గట్టిగా నొచ్చుకున్నట్టు సాక్ష్యం లేదు. తెలుసుకుందామని, వో రోజు అతన్ని బాగా కుషామత్ చేసి అడిగాను.

"మా అబ్బాయేనా ? కులాసాగా, దర్జాగా ఉన్నాడు" అన్నాడు.

"అదే; ఎక్కడ ?"

ఏదో వూరు చెప్పాడు. అక్కడ రంగధాం గారని ఒకాయన— ఊరికల్లా పేరు పొందిన మోతుబరి- పిల్లల్లేరట- అక్కడున్నాట్ట అబ్బాయి. "వాడికి తన జీవితమే కాదు; కొడుకుల జీవితాలు కూడా కులాసాగా గడిచిపోతాయి. అంచేత అక్కడే వుండనీ. వాడి కింకా మాటలు సరిగా రాకపోడంవల్ల మన అడ్రస్ చెప్పలేదు !.... మా ఆవిడతో చెప్పేవు గనక సుమా !"

ఔరా, అనుకున్నాను.

"ఇకపోతే మా బావమరది సూట్ కేసు సంగతి" అని, మంచం కింద దూరి ఓ పెట్టెలాగి, దుమ్ము దులిపాడు. "మన దగ్గిరికే చేరింది. చూడు" అని తెరిచాడు. దాన్నిండా అనేక ముద్రిత, అముద్రిత రచనలున్నాయి. "అంతా పరమ చెత్త. నా ఒక్కడి అభిప్రాయం కాదిది. విజయవాడలో ప్రచురణ కర్తలూ; హైద్రాబాద్‌లో పత్రికాధిపతులూ అందరూ అలాగని సర్టిఫై చేసేరు. పైగా ఈ సూట్ కేస్‌లో పదార్థాలు తిరిగి మా బావమరదికి యివ్వవద్దని నన్ను ముక్తకంఠంతో బ్రతిమాలారు." అని వివరించేడు సుబ్బారావు.

అతని టేస్ట్‌ను అభినందిస్తూ బయటపడ్డాను.

(24-11-79)